# 2న వేల్పూర్‌కు వెల్లువెత్తాలి

- మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపు
- వేల్పూర్ స్పైస్ పార్కులో ప్రజా ఆశీర్వాద సభ ఏర్పాట్ల పరిశీలన
- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే.. రాష్ట్రం అల్లకల్లోలమే..
- కొత్త ప్రభాకర్‌రెడ్డిపై హత్యాయత్నాన్ని ఖండించిన వేముల

**మేము సైతం..**



**అభివృద్ధి చేస్తున్న** పార్టీ వెంటే నడుస్తామంటూ మహిళలు సైతం ముక్తకంఠంతో నినదిస్తున్నారు. మంత్రి వెంటే నడుస్తామంటూ తీర్మానాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంత్రికి మద్దతు తెలిపి సెల్ఫీ తీసుకుంటున్న పిప్రి గ్రామానికి చెందిన మహిళలు.

వేల్పూర్, అక్టోబర్ 31 : వేల్పూర్ మండల కేంద్రంలోని స్పైస్ పార్కులో ఈనెల 2వ తేదీన నిర్వహించనున్న సీఎం కేసీఆర్ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన స్పైస్ పార్కులో విలేకరులతో మాట్లాడారు. వేల్పూర్ ఎక్స్ రోడ్డు స్పైస్ పార్కు మైదానంలో ఈ నెల 2న మధ్యాహ్నం 2 గంటలకు ప్రజాశీర్వాద సభలో సీఎం కేసీఆర్ పాల్గొంటారని తెలిపారు. బీఆర్ఎస్ పాలనలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, కేసీఆర్, తనను మనస్ఫూర్తిగా ఆశీర్వదించడానికి నియోజకవర్గ ప్రజలు తరలిరావాలని కోరారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనటువంటి అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు తెలంగాణలో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిపారన్నారు. తలసరి ఆదాయం, విద్యుత్ వినియోగం, ఐటీ ఉద్యోగాలు, గ్రామాల అభివృద్ధి, పచ్చదనం పెంపొందించడంలో తెలంగాణను ప్రథమస్థానంలో నిలిపిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. త్యాగధనుడు సీఎం కేసీఆర్ ఒక వైపు.. ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ రేవంత్‌రెడ్డి, తెలంగాణ ఉద్యమ సమయంలో రాజీనామా చేయమంటే అమెరికా పారిపోయిన ద్రోహి కిషన్‌రెడ్డి మరొక వైపు ఉన్నారన్నారు. ప్రజలు ఎవరి వైపు ఉంటారో ఆలోచన చేయాలని కోరారు.

**పదవుల కోసం కాంగ్రెస్ ఎంతకైనా తెగిస్తుంది**

కొత్త ప్రభాకర్‌పై కత్తితో దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని మంత్రి వేముల అన్నారు. ప్రజాస్వామికవాదులు తలదించుకునే పరిస్థితి ఉందన్నారు. కటాని రాజు కాంగ్రెస్ పార్టీ క్రియాశీలక సభ్యుడని, పదవుల కోసం కాంగ్రెస్ పార్టీ ఎంతకైనా తెగిస్తుందని మండిపడ్డారు. ఒక ఎంపీని కత్తితో పొడవడం దారుణమని, అభ్యర్థులను అంతమొందించాలనుకోవాలనే ఆలోచన చేయడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ పార్టీది మొదటి నుంచి నేరచరిత్రనే అని విమర్శించారు. గతంలో హైదరాబాద్‌లో మత కల్లోలాలు సృష్టించి వందల మందిని పొట్టన పెట్టుకున్న పార్టీ కాంగ్రెస్ అని దుయ్యబట్టారు. కాంగ్రెస్‌లో 10 మంది ముఖ్యమంత్రి అభ్యర్థులున్నారని ఎద్దేవా చేశారు. పొరపాటున కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రం అల్లకల్లోలం అవుతుందని హెచ్చరించారు. సీఎం పదవి కోసం ఎంతమందినైనా బలి తీసుకునే రకం కాంగ్రెస్‌దని ఆగ్రహం వ్యక్తంచేశారు. కొడంగల్ ఎన్నికల సమయంలో, తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులపైకి తుపాకీతో రేవంత్‌రెడ్డి వెళ్లాడని అన్నారు. రేవంత్‌రెడ్డి అంటేనే హింసను ప్రేరేపించే వ్యక్తి అని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల్లో బీఆర్ఎస్ తరపున ఈ ఘటనపై ఫిర్యాదులు చేస్తామని తెలిపారు. సమావేశంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ మార గంగారెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ రమేశ్‌రెడ్డి, మోర్తాడ్ జడ్పీటీసీ రవి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాజారాం యాదవ్, వేల్పూర్ ఉపసర్పంచ్ పిట్ల సత్యం, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

**సభా ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి**

సీఎం కేసీఆర్ బహిరంగ సభ కోసం కొనసాగుతున్న ఏర్పాట్లను మంత్రి వేముల మంగళవారం సాయంత్రం పరిశీలించి, పలు సలహాలు, సూచనలు చేశారు. 55 వేల మందితో సభను నిర్వహించే లక్ష్యంగా ఏర్పాట్లు చేస్తున్నారు.

# బిగాల ముమ్మర ప్రచారం



ప్రచారంలో పాల్గొన్న బిగాల గణేశ్‌గుప్తా



ప్రచారంలో పాల్గొన్న బిగాలను ఆశీర్వదిస్తున్న వృద్ధురాలు

ఖలీల్‌వాడి, అక్టోబర్ 31 : నగరంలోని బీఆర్ఎస్ అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తా ముమ్మర ప్రచారం చేస్తున్నారు. నగరంలోని 26 డివిజన్ (కోటగల్లీ, దోబీగల్లీ, చంద్రానగర్, రోటరీ నగర్, వివేకానంద కాలనీల్లో ఆయన కార్యకర్తలతో కలిసి మంగళవారం విస్తృత ప్రచారం చేశారు. బిగాలకు మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంచుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. నగరంలో తొమ్మిదేండ్లలో చేపట్టిన అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూకిరణ్, నగర అధ్యక్షులు సిర్ప రాజు, మాజీ కార్పొరేటర్ సిర్ప సువర్ణ, 7వ డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

# పోలింగ్ విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి

**పీవో, ఏపీవోల శిక్షణ తరగతుల్లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు**



ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ స్పోర్ట్స్, అక్టోబర్ 31 : శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఈనెల 30న చేపట్టనున్న పోలింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు అన్నారు. ఎలాంటి సందేహాలున్నా శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లతో నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు. జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలలో ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు కొనసాగుతున్న శిక్షణ తరగతులను ఆయన మంగళవారం పరిశీలించారు. ఫెలిసిటేషన్ సెంటర్లు, పీవోలు, ఏపీవోలకు అందిస్తున్న హ్యాండ్ బుక్, ఇతర పోలింగ్ సామగ్రిని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని, ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై సంపూర్ణ అవగాహన ఏర్పర్చుకోవాలని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను స్పష్టంగా తెలుసుకోవాలని సూచించారు. ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్‌ను ఉదయం 6 గంటలకు చేపట్టాలని సూచించారు పోలింగ్ సిబ్బందికి సర్వీస్ ఓటరు కింద ఫారం–12డీ ఇస్తామని, మలి విడుత శిక్షణ తరగతులకు హాజరయ్యే సమయంలో వాటిని అందించాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రాజేంద్రకుమార్, అధికారులు ఉన్నారు.

**షకీల్ రోడ్‌షో..**



నవీపేటలో నిర్వహించిన రోడ్ షోలో పాల్గొన్న బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్, బీఆర్ఎస్ శ్రేణులు

# ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం అద్భుతం

- అఖిల భారత రైతు సంఘాల నేతల ప్రశంస
- ముప్కాల్ పంపుహౌస్ సందర్శన

కమ్మర్‌పల్లి, అక్టోబర్ 31 : ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకం అద్భుతమని అఖిల భారత రైతు సంఘాల నేతలు ప్రశంసించారు. ఇలాంటి అద్భుత పథకాల ద్వారా తెలంగాణలో సీఎం కేసీఆర్ రైతుల సాగునీటి తాగునీటి కష్టాలు దూరం చేస్తున్నారని కొనియాడారు. పునరుజ్జీవంలో భాగంగా బాల్కొండ నియోజకవర్గంలోని ముప్కాల్ పంపుహౌస్‌ను అఖిల భారత రైతు సంఘాల నేతలు మంగళవారం సందర్శించారు. ఎస్సారెస్పీ పునరుజ్జీవం పథకం విశిష్టతను రివర్స్ పంపింగ్ ద్వారా కాళేశ్వరం జలాలను ఎస్సారెస్పీకి తరలించే ప్రక్రియను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, రైతునాయకుడు కోటపాటి నర్సింహనాయుడు వివరించారు. సీఎం కేసీఆర్‌తోనే ఇది సాధ్యమైందన్నారు. రైతులకు సాగునీటి కష్టాలు తొలగిపోయాయని, మండుటెండల్లో సైతం కాలువలు, చెరువులు నిండుకుండలా ఉంటున్నాయని తెలిపారు. 300 కిలోమీటర్ల కింద నుంచి కాళేశ్వర జలాలు ఎస్సారెస్పీకి ఎదురెక్కించడంతో వివిధ రాష్ట్రాల నుంచి రైతు నేతలు ఆశ్చర్యం వ్యక్తంచేశారు. కేసీఆర్ పాలనలో రైతులు సుభిక్షంగా ఉన్నారనడానికి ఇది నిదర్శనమని పేర్కొన్నారు. 24 గంటల కరెంట్, రైతుబంధు, రైతు బీమా, యావత్ దేశానికి ఆదర్శమని, రైతు పక్షపాతిగా కేసీఆర్ చక్కని పథకాలు ప్రవేశపెట్టారని కొనియాడారు. ముప్కాల్ పంపుహౌస్‌ను సందర్శించిన వారిలో రఘునాథ్ దాదా (పాటిల్, శెబ్కారి సంఘటన్, మహారాష్ట్ర), రాఘవేంద్ర కుమార్ (ఉత్తరప్రదేశ్ – కృషి భూమి బచావో మోర్చా), సేవాసింగ్ ఆర్య (హర్యానా – బీకేయు), కేఎం.రామగౌందర్ (తమిళనాడు – తమిళ్ వ్యవసాయ సంఘం), పరశురాం లక్ష్మణ్ (కర్ణాటక – ఫార్మర్స్ అసోసియేషన్ కర్ణాటక), కోటపాటి నర్సింహనాయుడు (తెలంగాణ–సౌత్ ఇండియన్ ఫార్మర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు), డాక్టర్ మంగిరాం (హర్యానా), కె.నాగరాజు (కర్ణాటక), అన్మంతరాజు(తమిళనాడు), బాలసాహెబ్ వాడ్కే (మహారాష్ట్ర) తదితరులు ఉన్నారు.బుధవారం వేల్పూర్‌లో నిర్వహించనున్న అఖిల భారత రైతు సంఘాల సమావేశంలో వీరంతా పాల్గొననున్నారు.



పునరుజ్జీవ పథకం గురించి అఖిల భారత రైతు సంఘాల నాయకులకు వివరిస్తున్న కోటపాటి

# నేడు వేల్పూర్‌లో అఖిల భారత రైతు సంఘాల సమావేశం

- తెలంగాణ రైతు పథకాలపై చర్చ
- ముఖ్యఅతిథిగా హాజరు కానున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

వేల్పూర్, అక్టోబర్ 31 : వేల్పూర్ మండల కేంద్రంలోని కేసీఆర్ ఫంక్షన్ హాల్‌లో అఖిల భారత రైతు సంఘాల నాయకుల సమావేశాన్ని బుధవారం నిర్వహించనున్నారు. ఉదయం 11 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుంది. తెలంగాణ రైతు పథకాలపై చర్చించే ఎజెండా, లక్ష్యంతో ఈ సమావేశం నిర్వహిస్తున్నారు. సమావేశానికి రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.